ప్రధాన రహదారి గుంతలమయం

- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని వైనం
- నాలుగేళ్లుగా ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని మరమ్మతు పనులు



గుంతమయంగా ఉన్న రోడ్డు

జ్యోతినగర్: సుందర రామగుండంగా తీర్చిదిద్దుతాన్న పాలకులు.. ప్రధాన రహదారులను పట్టించుకోకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ నుంచి రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. నాలుగేళ్లుగా వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కార్పొరేటర్ రెండేళ్ల క్రితం గుంత రోడ్డుపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1న ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రూ.2కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు శిలాఫలకం ఆవిష్కరించారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం ముందు ఉన్న రోడ్డులో పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో గుంతలు ఏర్పడక వాహనదారులకు అందులో పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు నిర్మాణ పనులు పొందిన కాంట్రాక్టర్‌తో పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎన్టీపీసీ ఏరియా.. అధిక రద్దీ ఉండే దారి

రాజీవ్ రహదారి నుంచి రామగుండం ఎరువుల కర్మాగారానికి వెళ్లే అతి పెద్ద ప్రధాన రహదారి ఎన్టీపీసీ ఏరియా. ఈ దారి గుండా ఖాజీపల్లి, మాతంగి కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రగతి నగర్, గౌతమినగర్, ఎల్కలపల్లి, లక్ష్మీపురంతో పాటు యైటింక్లయిన్ కాలనీకి కూడా ఈ దారి గుండా ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా..



మేయర్ అనిల్‌కుమార్‌కు, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావుకు రోడ్డు మరమ్మతు గురించి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం. రోడ్డు పనులకు ఎమ్మెల్యే శిలాఫలకం ఆవిష్కరించినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. కోట్లాది నిధులు అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామంటున్న పాలకపక్షాలకు ఈ గుంతల రోడ్డు కనిపించడం లేదా?

– కొలిపాక సుజాత, కార్పొరేటర్, 24వ డివిజన్

పట్టించుకోవడం లేదు



రామగుండం కార్పొరేషన్‌లోని పలు రోడ్లు గుంతలుగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ నుంచి టౌన్‌షిప్ రింగ్ రోడ్, మల్కాపూర్ రోడ్ రాజీవ్ రహదారి నుంచి గ్రామం వరకు, ఎస్‌బీఐ బ్యాంకు రోడ్ నుంచి నర్రాశాలపల్లె వరకు ఉన్న రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఎన్నిసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పనులు మాత్రం కావడం లేదు.

– ఎండీ రహీం, కాంగ్రెస్ నాయకుడు

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి: ఓటరుగా నమోదు చేసుకోవడానికి యువత దరఖాస్తు చేసుకోవాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ సూచించారు. జేఎన్టీయూ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 19లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫామ్–6 ద్వారా నూతన ఓటు నమోదు చేసుకోవాలని ఆధార్‌కార్డు, పాస్ ఫొటో ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, ఈఈఈ విభాగ అధిపతి దుర్గారావ్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలు సమర్థంగా విధులు నిర్వహించాలి

రామగిరి: బీఎల్‌వోలు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా చేపట్టాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ ఆదేశించారు. తహసీల్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను నిర్ధారించాలని, బీఎల్‌వో యాప్‌లో వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. 26, 27వ తేదీల్లో, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 వరకు దరఖాస్తులను ఆయా బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, ఆర్ఐ రాజాబాబు, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ కొలిపాక శ్రీను జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణం 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలు శుక్రవారం సుల్తానాబాద్‌లో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా డైరెక్టర్ వీరస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. దివ్యాంగుల కేంద్రంలో పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తూడి కనకయ్య, వినోద్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలిగేడు: పెద్దపల్లి 18వ వార్డు కౌన్సిలర్, బీసీ యువ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు రాయనవేణి శ్రీనివాస్, నారాయణపల్లి ఉపసర్పంచ్ సబ్బు శ్రీధర్, మత్స్యసహకార శాఖ జిల్లా డైరెక్టర్ సబ్బు మల్లయ్య, నర్సాపూర్ అధ్యక్షుడు యాదగిరి రవి, సబ్బు లక్ష్మణ్, పోతుగంటి సురేశ్, పిట్టల నరేశ్, యాదగిరి రంజిత్, గణేశ్, సిద్దం సంపత్ పాల్గొన్నారు.

జూలపల్లి: ముదిరాజ్ సంఘం నాయకుడు, పెద్దపలి మున్సిపల్ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు జెట్టి సతీశ్, సంఘం నాయకులు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ స్వామి, రాజయ్య, వెంకటేశం, శ్రీనివాస్, రవి, లింగయ్య, రాజయ్య, ఆంజనేయులు, కిరణ్, సంపత్ పాల్గొన్నారు.



గోదావరిఖనిటౌన్: వరలక్ష్మీ వ్రతంలో మహిళలు



జ్యోతినగర్: చిలుకలయ్య దేవాలయంలో..



కాల్వశ్రీరాంపూర్: కూనారంలో..



మంథని: దర్శనం కోసం వచ్చిన భక్తులు

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

ఎలిగేడు/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/జూలపల్లి/ఫెర్టిలైజర్‌సిటీ/గోదావరిఖనిటౌన్/జ్యోతినగర్/మంథని/కమాన్‌పూర్: జిల్లావ్యాప్తంగా ఆయ గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మీవ్రతం పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో వరలక్ష్మి వ్రతం నోము పూజలు చేశారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



డ్రమ్ములను పరిశీలిస్తున్న సాయినాథ్

రామగిరి: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మైనింగ్ ఏడీ, మండల స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ కోరారు. మండలంలోని రత్నాపూర్‌లో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో ఇనుముల రమేశ్, సర్పంచ్ పల్లె ప్రతిమ, సెక్రటరీ రమ్య ఉన్నారు.

బట్ట సంచులు పంపిణీ



బట్ట సంచులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఎస్ఎంఎస్ ప్లాంట్ ఉద్యోగులకు బట్ట సంచులు పంపిణీ చేశారు. ప్లాంట్ పీవో రమేశ్ మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ నేత్ర, అవయవ దానాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

జూలపల్లి: పద్మశాలీ సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని పద్మశాలీ యువజన విభాగం నాయకులు చిప్ప శ్రీకాంత్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా పరంగా అత్యధికంగా ఉన్న స్థానాల్లో పద్మశాలీ నాయకులకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు మేరుగు యాదగిరి, నాయకులు మండల యూత్ అధ్యక్షుడు మేరుగు రమేశ్, ప్రధాన కార్యదర్శి బాలెంగల హన్మయ్య, దీకొండ ఆంజనేయులు, సత్యం, సంబారి ఆంజనేయులు, ఉప్పుల తిరుపతి, చిప్ప శంకయ్య, రాజమల్లు, కనుకయ్య, మొందయ్య, పోచమల్లు ఉన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

పాలకుర్తి: మండలంలోని ఘనశ్యాందాస్‌నగర్ (జీడీనగర్) గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ సూర సమ్మయ్య భూమిపూజ నిర్వహించారు.

గోశాలలకు గోగ్రాసం అందజేత

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని గొల్లపల్లిలో ఉన్న గోశాలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి గోగ్రాసం అందజేశారు. శ్రావణమాసం పవిత్ర శుక్రవారం పురస్కరించుకొని శ్రీధర్మ శాస్త్ర గోశాలలోని గోవులకు 50కిలోల గోగ్రాసంతో పాటు అరటి పండ్లను అందించారు. జిల్లా కోఆర్డినేటర్ జూలూరి అశోక్, ఉపాధ్యక్షులు పిట్టల వెంకటేశ్, కట్ల సంపత్, తమ్మనవేణి సతీశ్, గోశాల వ్యవస్థాపకులు బండారి సూర్య, దేవేందర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రి జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖాధికారి దేవనంది శ్రీనివాస్ అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకేజీ, ఎలక్ట్రికల్ షాట్ సర్క్యూట్‌తో కలిగే ప్రమాదాలను నియంత్రించడంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రామగిరి: మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన తొట్ల పునీతకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.21వేల చెక్కును శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి బర్ల కుమార్, గ్రామ అధ్యక్షుడు అశోక్, పెద్దపల్లి సంతోష్, రొడ్డ శ్రీనివాస్, సంజీవ్, ఓదెలు పాల్గొన్నారు.

బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఓదెల: మొఘల్ చక్రవర్తి సామ్రాజ్యాన్ని ఎదిరించిన బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఓదెలలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో అధికారికంగా పాపన్న జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం గీతకార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. అనంతరం తాటి చెట్టు ప్రమాదలో గాయపడిన బాధితులకు రూ.15వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ గీతకార్మికుల చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారి జె.రంగారెడ్డి, వసతిగృహ సంక్షేమ అధికారి బి.రమేశ్, గీత కార్మికుల సంఘం నాయకుడు పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి యువకులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, రేగడిమద్దికుంట తదితర గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీలో కార్యకర్త నుంచి నాయకుల వరకు ఒకే విధంగా సముచిత స్థానం ఉంటుందన్నారు. రైతు సమితి జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ రమేశ్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు ప్రేమ్‌చందర్‌రావు ఉన్నారు.

శ్రీసంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో మహిళలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 30, 31వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీసంతోషిమాత జన్మదిన వేడుకలకు సంబంధించిన కరప్రతం ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు పవన్ మహరాజ్ జీఎంతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గండి వసంతలక్ష్మి–సదానందం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో మొక్కలు నాటేందుకు చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, డీఎఫ్ఓ శివయ్య, నాగయ్య పరిశీలించారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. డీసీ త్రయంబకేశ్వరరావు హరితహారం ఇన్‌చార్జి అధికారి అర్జున్ ఉన్నారు.

ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలి



మొక్కలకు గుంతలు తవ్విస్తున్న కమిషనర్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించడమే కాకుండా వెంటనే గుంతలు తవ్వి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మార్కండేయ కాలనీలో శుక్రవారం ఖాళీ స్థలాల్లో గుంతలు తవ్వించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక అధికారులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన ఆర్జీ–2 ఏరియా 18వ డివిజన్ అల్లూరు గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 ఏరియా జీఎం సూర్య నారాయణ తెలిపారు. వకీల్‌పల్లి గనికి సంబంధించి నిర్వహించిన ప్రజా అభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని రెమెడియేషన్ కింద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో భాగంగా 27న ఆదివారం అల్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఆర్జీ–2 సింగరేణి వైద్య బృందంతో అల్లూరు గ్రామంతో పాటు పెంచికల్‌పేట్, న్యూమారేడుపాక, వీర్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్రదానం చేసి చూపును ప్రసాదించండి

గోదావరిఖనిటౌన్: మరణానంతరం నేత్రదానం చేసి ఇద్దరికి చూపును ప్రసాదించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రామగుండం లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని కాకతీయ జూనియర్ కళాశాలలో జాతీయ పక్షోత్సవాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, సెక్రటరీ బంక కళావతి, ట్రెజరరీ మనీషా అగర్వాల్, సదాశయ ఫౌండేషన్ బాధ్యులు లింగమూర్తి, కేఎస్.వాసు, కళాశాల డైరెక్టర్ ఆకుల శ్రీనివాస్, సీనియర్ లయన్స్ సభ్యులు మేడిశెట్టి గంగాధర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, తానిపర్తి గోపాల్‌రావు, బంక రామస్వామి పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యం

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తోందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మొగురం రమేశ్ అన్నారు. మండలంలోని బాలరాజు పల్లెలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షలు మంజూరు కాగా సర్పంచ్ కుంటూరి రాజయ్యతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఉపసర్పంచ్ తిరుపతి, నాయకులు మల్లేశం, సతీశ్, బాలయ్య, స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఓటరుగా నమోదు చేసుకోండి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 26, 27వ తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేకంగా ఓటరు నమోదు చేయనున్నట్లు శుక్రవారం అంతర్గాం తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు తెలిపారు.

✦దాడి చేసిన వారిపై చర్య తీసుకోండి

మంథని: ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో భూమిలో వరినారు వేస్తుండగా గ్రామానికి చెందిన పల్లె రాము, లక్ష్మణ్, జంగాపల్లి రాజేశ్వరి తమపై కారంపొడి చల్లి కర్రలతో దాడి చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని జంగిపెల్లి రాజమల్లు అనే రైతు కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజమల్లు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

✦పుట్ట మధు గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

ముత్తారం: మంథని ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్ పేర్కొన్నారు. ముత్తారంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుట్ట మధు చేసిన అభివృద్ధి సంక్షేమాలను గ్రామాల్లో ఇంటింటికీ వివరిస్తూ గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

✦శ్రీధర్‌బాబుపై విమర్శలు సరికాదు

మంథని: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై జెడ్పీచైర్మన్ పుట్ట మధు విమర్శలు చేయడం సరైంది కాదని బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. తన అభివృద్ధికి మాట్లాడకుండా రోజూ శ్రీధర్‌బాబు గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో సింగిల్‌విండో డైరెక్టర్ రావికంటి సతీశ్, నాయకులు లైశెట్టి రాజు, పార్వతి కిరణ్, శ్రీనివాస్ ఉన్నారు.

✦బేగంపేట్‌లో రెండు డెంగీ కేసులు నమోదు

రామగిరి: మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన ఇద్దరికి డెంగీ నిర్ధారణ అయింది. ఒకరు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మరొకరు ప్రస్తుతం స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఈనెల22న శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించగా 23న డెంగీ వ్యాధికి గురైనట్లు అధికారులు నిర్ధారించారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు, పంచాయతీ సిబ్బంది బాధితుల ఇంటి పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి మందు స్ప్రే చేయించారు.

✦పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు

పాలకుర్తి: కన్నాల బోడగుట్టకు అనుబంధంగా మండల ప్రధాన రహదారి, ఫోర్‌లేన్ రహదారిని ఆనుకుని ఉన్న క్రషర్లపై తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం బామ్లానాయక్‌తండా సర్పంచ్ బదావత్ రాజునాయక్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న క్రషర్ యజమానులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు జనావాసాలు లేని దూరప్రాంతాలకు క్రషర్లను తరలించాలని కోరుతూ రామగుండంలోని పర్యావరణ ఇంజనీరు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

కేంద్ర సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే పాఠక్

ధర్మారం: నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్ సూచించారు. ప్రవాస్ యోజనలో భాగంగా మండల కేంద్రానికి శుక్రవారం వచ్చిన పాఠక్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ధర్మారం శివారు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. అనంతరం పాఠక్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. బీజేపీ ముఖ్యమంత్రి యోగి పాలనలో ఉత్తరప్రదేశ్ ఉత్తమ ప్రదేశ్‌గా మారిందని వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాడే సూర్యనారాయణ, ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, జగిత్యాల ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మెడవేని శ్రీనివాస్, సందనవేని లక్ష్మణ్, జంగిలి రాజయ్య, కిశోర్, మణికంఠ, మల్లేశ్వరీ, మల్లేశం, మహేందర్‌రెడ్డి, కోమురేశం, రాజన్న, గుర్రం తిరుపతి, ఓరగంటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారంతోనే బీపీ మండల్‌కు అసలైన నివాళి



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు



రామగిరి: మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మధు



మంథని: నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్/మంథని/రామగిరి/కమాన్‌పూర్: బీసీలంతా ఏకమై రాజ్యాధికారం దక్కించుకున్న నాడే బహుజన పితామహుడు బీపీ మండల్‌కు అసలైన నివాళి అని బీసీ నాయకులు అన్నారు. ఈ మేరకు జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగిరి, కమాన్‌పూర్‌లో శుక్రవారం జాతీయ బీసీ కమిషన్ రెండో చైర్మన్ బీపీ మండల్ 105వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ జమీందార్ కుటుంబంలో జన్మించి బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి బీపీ మండల్ అని కొనియాడారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

జ్యోతినగర్(రామగుండం): కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదామని కాంట్రాక్టు కార్మికుల సంఘం(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి బుచ్చన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశభక్తి పేరుతో సంపదను లూటీ చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం, కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ 29న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్‌లను పర్మినెంట్ చేయకుండా యాజమాన్యాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ షెడ్యూల్స్ జీవో గెజిట్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.